# మాయ(మైన) మొగుళ్ళు

అశీష్ కెనడా వెళ్ళాడే కానీ, అతని దగ్గరనించీ సమాచారం లేదు. సోనియా ఎన్నిసార్లు ఫోన్ చేసినా ఎప్పుడూ ఆన్సరింగ్ మెషీనే వచ్చేది. అలా పబ్లిక్ ఫోన్‌నించీ రోజూ ఎన్ని మెసేజ్‌లని ఇస్తుంది. ఆమెని ఇంకేమీ ఇబ్బంది పెట్టకూడదనుకున్నాడో ఏమో, అశీష్ తన ఫోన్ కనెక్షన్ పీకేయించాడు. అతను వేరే నెంబరుకి మార్చించుకున్నాడో, అసలు ఇంకెక్కడికో మారిపోయాడో ఎవరికీ, ఆఖరికి గుడిలో దేవుడికీ తెలీదు మాయమైన మొగుడికి తప్ప.

రోజులు నెలలయాయి. నెలలు సంవత్సరాలయాయి. సోనియాని చుట్టుపక్కల అందరూ చిన్నచూపు చూడటం మొదలుపెట్టారు. ఆమెకిటు మొగుడి బాధే కాకుండా, అమ్మలక్కల బాధా ఎక్కువయింది. అయినా లెఖ్ఖ చేయలేదు. అశీష్ కోసం వెతకటం మాత్రం మానలేదు. మధ్య తరగతి కుటుంబం అవటం చేతా, ఎక్కువగా చదువుకోకపోవటం చేతా, ఎలాగో తంటాలు పడి ఒక చిన్న బ్యూటీ సెలూన్ మొదలుపెట్టింది. అక్కడికి వచ్చే ఆడవారిలో, ఒకళ్ళిద్దరి కథలు, కొంచెం తేడాతో తన కథల్లాటివే. ఇక్కడ కావలసింది ఒకళ్ళనొకళ్ళు చులకన చేసుకోవటం కాదు. సానుభూతి చెప్పుకోవటం అసలే కాదు. ఒకళ్ళకొకళ్ళు కలిసి బలం పుంజుకోవటం. కలిసి ఇలాటి అక్రమాలని ఆపటం, నేరస్థులకి శిక్ష పడేలా చూడటం. అందుకే అందరూ కలిసి ఒక గ్రూప్‌ని మొదలుపెట్టారు. అలా ఒకళ్ళతో ఒకళ్ళు మాట్లాడుకుని, బయటికి రావటం వల్ల, వెనకాల వేధించే వాళ్ళు తగ్గి, ముఖాముఖీ సహాయం చేసేవాళ్ళు ఎక్కువయారు. స్థానిక టీవీలోకూడా మాయమైన మొగుళ్ళ గురించి చెప్పి, ఎంతో ప్రచారం చేశారు. ఇలాటివి చేస్తే ప్రయోజనం ఏమిటి, కెనడాలో వాడిని పట్టుకుని తన్నాలి కానీ అంటారు కొంతమంది సోద్యం చూసే సోమరాజులూ, సోమిదేవమ్మలూ. కాదు దాని వల్ల చాల ప్రయోజనం వుంది.

టీవీలోనూ, ప్రత్యక్షంగానూ చూసిన వారిలో ఆల్ ఇండియా వుమెన్స్ డెమోక్రాటిక్ అసోషియేషన్ నించీ బృందా కరత్, 'యాక్షన్ ఎగెనెస్ట్ డెసర్టెడ్ బ్రైడ్స్' స్థాపించి ఎంతో సహాయం చేస్తున్న మాజీ కేబినెట్ మంత్రి బి.యస్.రామవాలియా, సాంఘికసేవలో ముందున్న అట్టార్నీ షేర్ సింగ్ వున్నారు. రామవాలియా లెఖ్ఖల ప్రకారం ఒక్క పంజాబ్‌లోనే ఇలాటి పుట్టింటి భార్యలు పదివేల పైన వున్నారుట. మాయ(మైన) మొగుళ్ళ మీద కేసులు పెడితే, పదేళ్ళ లోపున తెమిలినవి ఒక్కటీ లేవుట. అది మన గవర్నమెంటాలిటీ కథ. ఎన్నేళ్ళకయినా, ఎప్పటికయినా అలాటి మోసగాళ్ళు జైలుకి వెళ్ళటమే నా లక్ష్యం. వాళ్ళకి సభ్య ప్రపంచంలో తిరిగే హక్కు లేదు అంటాడాయన. బృందా అంటుంది, 'ఇలాటివారు ఎన్నో లక్షల మంది వున్నారు దేశంలో'. మనకి తెలిసిన సంఖ్య చాల తక్కువ. చాలమంది ఇలాటివి బయటికి

చెప్పరు. మన సామాజిక వ్యవస్థలో తమ కథనం బయటపెట్టటానికి ఎంతో ధైర్యం కావాలి. అది చాల మందికి వుండదు. ముఖ్యంగా మధ్య తరగతి మనుష్యులకి'

ఇలా తమకి జరిగిన అన్యాయాలతో బయటికి వచ్చినందువల్ల, సోనియాకీ నమీతాకీ చాల మంచి జరిగింది. ఈ వార్తా ప్రసారం చూసి, కెనేడియన్/అమెరికన్ టీవీవాళ్ళు సహాయం చేయటానికి ముందుకి వచ్చారు. వీరి కథనం అంతా పూర్తిగా విని, కెనడాలోని ఈ మాయదారి మొగుళ్ళని దారి పొడుగునా వెతికి చివరికి పట్టుకున్నారు.

నమీత భర్త పంకజ్ టొరాంటోలో వున్నాడు. టీవీవాళ్ళు కెమెరాతో అతని ఇంటికి వెడితే, అతనే తలుపు తీసి లోపలికి రమ్మన్నాడు. కాకపోతే కెమెరాని లోపలికి రానీయలేదు.

'తప్పంతా నమీతాదే ఆమె మోసం అంతా బయట పెడతాను. నేను ఆమె దగ్గర్నించీ విడాకులకి కోర్ట్ ఉత్తరం పంపిస్తాను. నేను నా లాయర్‌తో మాట్లాడి రెండు రోజుల్లో మీకు ఫోన్ చేస్తాను' అని ఎంతో మర్యాదగా చెప్పాడు.

రోజులు వారాలయాయి. అతనా అడ్రస్ నించీ గల్లంతయాడు. కానీ నమీతకి కెనడా కోర్ట్ నించీ నోటీస్ వచ్చింది. ఫలానా రోజు లోపల వచ్చి, నీ కథ చెప్పుకో. లేకపోతే విడాకులు తీసుకోవాలి అని.

'నన్ను మోసం చేశాడు. నేనతన్ని వదిలిపెట్టను. వదిలేస్తే ఇంకా ఎంత మందిలా నష్టపోతారో' అంది. కెనేడియన్ ఎంబసీకి వెళ్ళి వీసాకి దరఖాస్తు పెట్టింది. కావలసిన ఎన్నో కాగితాలు ఇచ్చినా, దురదృష్టవశాత్తూ ఆమెకి వీసా రాలేదు. ఆ పరిస్థితుల్లో ఆమె వెనక్కి తిరిగి వస్తుందనే నమ్మకం, వీసా ఇచ్చేవారికి కలగలేదు. ఆమెకి సమ్మన్స్ ఇచ్చినా సమయానికి రాలేదని, కోర్ట్ పంకజ్‌కి విడాకుల కేసులో అతని పక్షమే పలికింది.

అయినా నమీత పట్టు విడవలేదు. 'కెనాడాకి పోలేను. ఇండియా న్యాయ స్థానం విదేశీ కోర్టల డిక్రీలని ఒప్పుకోదు. రెండు దేశాల న్యాయశాస్త్రాలూ పూర్తిగా విరుద్ధం. ఆ వివరాల్లోకి వెళ్ళటం అనవసరం. నా తప్పు ఏమీ లేకపోయినా నాకెందుకో ఈ శిక్ష అర్థం కాదు. ఆత్మహత్య చేసుకుందా మనుకున్నాను ముందు. ఎవరి తప్పుకో నన్ను శిక్షించుకోవటమెందుకు? అది అజ్ఞానమే కాకుండా, ఇటువంటి దుర్మార్గులకి ఇంకా ఎన్నో మోసాలు చేయటానికి అవకాశం ఇచ్చినట్టు అవుతుంది. అందుకే దీని అంతు చూద్దామనుకున్నాను. ఇక్కడి హైకోర్ట్‌లో కేసు పెట్టాను. అదృష్టవశాత్తూ అతను కెనడాలో వున్నా భారత పౌరుడే కేసు రెండేళ్ళు పట్టింది. అతను ఒక్కసారీ హాజరు కాలేదు. చివరికి షేర్ సింగ్ సహాయంతో తీర్పు నా వైపే వచ్చింది. పంకజ్‌కి పదివేల డాలర్ల జరిమానా, జైలు శిక్ష వేశారు. అతను భారత దేశంలో అడుగుపెట్టగానే అరెస్టు చేసే వారంట్ ఇచ్చారు. అక్కడినించీ డిపోర్టేషన్‌కి ప్రయత్నాలూ మొదలుపెట్టించాం. అతనికే కాదు, అలాటివారికందరికీ బుద్ధి చెప్పాలి' అంది. ఆమె అందమైన ముఖంలో పట్టుదల ప్రస్ఫుటంగా కనిపిస్తున్నది!

మరి సోనియా?

టీవీ డాక్యుమెంటరీ తీసేవాళ్ళు పట్టుదలతో అశీష్‌ని కెనాడాలోని వాంకూవర్‌లో పట్టుకున్నారు. అశీష్ కథనం పూర్తిగా వేరు. తను పదివేల డాలర్లూ, పాస్‌పోర్టూ సోనియాకి ఇచ్చాడుట. సోనియా, ఆమె తండ్రీ తల్లీ అందరూ తాగుబోతులు, తనని సరిగ్గా చూసేవాళ్ళు కాదన్నాడు. డబ్బులూ, పాస్‌పోర్టూ తిరిగి ఇవ్వలేదుట. తనే పాస్‌పోర్టు తీసుకుని పారిపోయి కెనడాకి వచ్చేశానన్నాడు. తన భార్యని రమ్మన్నా తనతో కాపురానికి రాలేదనీ, నాలుగేళ్ళనించీ ఒంటరిగా, వేరుగా వుంటున్నానని కోర్టులో నిరూపించి, విడాకులు తీసుకున్నాడు. కెనడా న్యాయశాస్త్రం ప్రకారం, భార్య భర్తని వదిలేసి సంవత్సరం వేరుగా వుంటే చాలు, వేరు పడినట్టే. విడాకులు ఇవ్వటం కష్టమేమీ కాదు. ఇలాటి న్యాయసూత్రాలు మాయ(మైన) మొగుళ్ళకి బాగా తెలుసు. అశీష్ దానికి పూర్తిగా న్యాయం చేకూర్చాడు!

'నేను పూర్తిగా మోసపోయాను. కానీ ఇలా ఇంకెవరికీ జరగకుండా నా చేతనైనదంతా చేస్తాను. ఇలాటి విషయాల్లో దెబ్బ తిన్న వాళ్ళు, దాపరికం లేకుండా బయటికి వచ్చి పోరాడేటట్టు చేయటమే నా ఆశయం' అంది ఆత్మ విశ్వాసం ఆమె కళ్ళల్లో కదలాడుతుంటే.

O O O

అయ్యా! తమరు ఇంతకు ముందు పుట్టింటి భార్యలు అనీ, ఇప్పుడేమో టీవీ సీరియల్లా వరసగా మూడు వ్యాసాలు నిత్య పెళ్ళికొడుకులు, నాతి చరామి, మాయ(మైన) మొగుళ్ళు అనీ ఇన్ని వ్యాసాలు వ్రాస్తున్నారు కదా, అంత అవసరం వుందా? ఎక్కడో ఉత్తర భారతదేశంలో జరిగితే, అది మనదాకా వస్తుందా, మాకు తెలిసినవాళ్ళెవరికీ ఇలాటి అనుభవం లేదే?

అవును అవసరం వుంది. మూడు కారణాలవల్ల ఎంతో అవసరం వుంది. ఒకటి ఉత్తరం, దక్షిణంతో సంబంధం లేకుండా భారతదేశంలో ప్రతి ఏటా ఇలాటివి వేలకి వేలు జరుగుతున్నాయనీ, పంజాబులోనే ఇలాటి కేసులు పదివేల పైన వున్నాయనీ, ఆంధ్రప్రదేశంలో దీనికి మూడు నాలుగు రెట్లు జరుగుతున్నాయనీ తెలుస్తున్నది. రెండవది మనం మన దాకా రాదనుకోవటం పిల్లి కళ్ళు మూసుకుని ఎవరూ చూడటం లేదని పాలు త్రాగినట్టుగానే. మూడవది ఇలాటి అనుభవాలు అయినవారు ఎంతోమంది బయటికి చెప్పుకోరు కనుక, మనకి నిజంగా ఎంతమంది ఇలా బాధలు పడుతున్నారో తెలియటం కష్టం.

మరి విదేశీ సంబంధాలు అన్నీ ఇలాటివేనా? కానే కాదు. అమెరికాలోనూ, మిగతా దేశాలలోనూ ప్రతి రోజూ, ప్రతి చోటా ఎంతో అన్యోన్యంగా సంతోషంగా జీవిస్తున్న యువ దంపతులు ఎంతోమంది. ఏటేటా లక్షల మంది భారతీయులు విదేశాలకి వలస పోతుంటే, వారిలో ఇలా దెబ్బతిన్నవారు సంఖ్యల్లో శాతం పరంగా చూస్తే చాల తక్కువ. కాకపోతే, ఆ కొంతమంది మాత్రం ఎందుకు ఇలాటి నిత్య పెళ్ళికొడుకుల దారుణాలకి బలి అవాలి? అందుకే ఈ వ్యాసాలు! ఎవరికైనా ఈ సమాచారం ఉపయోగపడితే అంతకన్నా కావలసిందేముంది!

O O O